క్లుప్తంగా

ధ్యానంతో ప్రశాంతత

పెనుమంట్ర: ధ్యానంతో మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవచ్చని పిరమిడ్ ధ్యాన కేంద్రం సైంటిస్ట్ నాగేశ్వరరావు అన్నారు. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ టిబెట్ మహాయోగి మిలారేపా జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పెనుమంట్ర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మూడు రోజుల మౌనధ్యాన కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మాటలకు ఆటుపోటులు ఉంటాయని, మౌనం నిర్మలంగా నిదానంగా నిలకడగా ప్రవహించే జ్ఞాన ప్రవంతి అని, దీనిని అనుసరిస్తే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతామని నాగేశ్వరరావు అన్నారు. ఈసందర్భంగా పలువురికి మౌనధ్యానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూపతిరాజు శ్రీనివాసరాజు, పిరమిడ్ ధ్యాన కేంద్ర సభ్యులు, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన శిక్షణా కేంద్ర సభ్యులు పాల్గొన్నారు.

నేడు చీఫ్‌విప్ ముదునూరి పర్యటన ఇలా

నరసాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆదివారం ఉదయం 11 గంటలకు వైఎస్ పాలెం పంచాయతీ చవ్వాకుల వారి మెరక గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 4 గంటలకు చీఫ్‌విప్ తన క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారని కార్యాలయ వర్గాలు తెలిపారు.

పక్షవాత బాధితునికి సాయం

పాలకొల్లు అర్బన్: పక్షవాతంతో బాధపడుతున్న ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన తాడిగడప ప్రభాకరరావుకి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ప్రకటించిన రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. పాలకొల్లు వసుధ ఫౌండేషన్ కార్యాలయంలో రోగి బంధువులకు ఈ ఆర్థిక సహాయాన్ని కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పి శ్రీను, రాంబాబు తదితరలు పాల్గొన్నారు.

నిర్మాణాలు వేగవంతం చేయాలి

మొగల్తూరు: మండలంలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి.విజయలక్ష్మి ఆదేశించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌసింగ్ డీఈఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈ ఫణీంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

పెనుగొండ: జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ 100 శాతం పూర్తికి ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయా లని ఎంఈఓ డి.శుభాకరరావు అన్నారు. శనివారం పెనుగొండ ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ ఇన్‌చార్జి గోపి, టీటీడీ బోర్డు మెంబర్ శేషుబాబు

పాలకొల్లు అర్బన్: సమన్వయంతో పనిచేసి పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దామని పార్టీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పిలుపు నిచ్చారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో శనివారం ఏర్పాటుచేసిన నియోజకవర్గస్థాయి సచివాలయ కన్వీనర్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అభిమానులు, తటస్థులను కలిసి, వారిని పార్టీలోకి ఆహ్వానిద్దామని అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా సేవలందిస్తానన్నారు. తనపై నమ్మకంతో టీటీడీ బోర్డు మెంబర్‌గా నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తొలుత మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు నడపన గోవిందరాజుల నాయుడు, గుంటూరు పెద్దిరాజు, చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయ వర్మ, ముచ్చర్ల శ్రీరామ్, ఎంపీపీలు రావూరి వెంకటరమణ (బుజ్జి), సబ్బితి సుమంగళి, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు, పట్టణ, మండలాల కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం మైఖేల్‌రాజు, పాతూరి బుచ్చిరాజు, చిట్టూరి ఏడుకొండలు, సచివాలయ కన్వీనర్లు పార్శి వెంకటరత్నం, ఎంఎస్ వాసు, ఓదూరి భాస్కరరావు, బళ్ల రాజశేఖర్, పార్టీ నాయకులు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, ఉచ్చుల స్టాలిన్, మద్దా చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

నేడు జైన్ బాలమునుల అవధానం

నరసాపురం: స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి గుజరాత్‌కు చెందిన కలవలలు జైన్ బాలమునులు నమి చంద్రసాగర్, నేమి చంద్రసాగర్‌లు అవధానం చేయనున్నారు. జైన్ సంఘం గురువు అభినందన చంద్రసాగర్ మాట్లాడుతూ గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఈ బాలమునులిద్దరూ తమ తొమ్మిదో ఏట సన్యాసం తీసుకున్నట్టు చెప్పారు. 10 భాషల్లో వీరు అవధానం చేస్తారని తెలిపారు. జైన్ మతంలో ఐదువేల శ్లోకాలతో పాటుగా ఖురాన్, బైబిల్, భగవద్గీత గ్రంథాలపై 100 మంది ఏ భాషలో ప్రశ్నలు అడిగినా సమాధాలు చెబుతారని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సంస్కృత అవధాన ప్రక్రియ మాదిరిగా దేశవ్యాప్తంగా వీరి అవధాన ప్రక్రియకు మంచి పేరుందని, అనేక రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇస్తూ ఐదువేల కిలో మీటర్లపైనే ఆధ్యాత్మిక పాదయాత్రలు చేశారని వివరించారు.

ప్రాధాన్యత క్రమంలో గ్రామాల అభివృద్ధి

ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్రి వాసు

పెనుమంట్ర: మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సూచనలతో ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పెనుమంట్ర మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు) అన్నారు. శనివారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వెనుకబడిన గ్రామాల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. గ్రామీణ అభివృద్ధిశాఖ నిధులు రూ.60 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. రూ.20 లక్షలతో పెనుమంట్రలో రాజన్నకాలనీ రోడ్లు, రూ.40 లక్షలతో గరువు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ, సొంబయ్య చెరువుగట్టు, ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి సభ్యులు ఆమోదించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆచంట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ప్రజా ప్రతినిధులంతా ఐక్యతతో గ్రామాలను అభివృద్ధి పథంలోకి నడిపించుకోవాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మార్టేరులోని వనంపల్లి రోడ్డులో ఉన్న సంతమార్కెట్‌లో చేపలు, మాంసం దుకాణాలు వేరే చోటికి మార్చాలని నెగ్గిపూడి ఎంపీటీసీ సభ్యురాలు పెనుగొండ లక్ష్మి కోరారు. వివిధ సభ్యులు లేవనెత్తిన సమస్యలపై ఆయాశాఖల అధికారులు వివరణలు ఇచ్చారు.

సేవకులకు సత్కారం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్న పెనుమంట్ర మండలంలో వివిధ శాఖల అధికారులను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఎం బాపూజీ, పంచాయతీ విస్తరణాధికారి పీవీవీఎస్ రామ ప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్ జి.రవికాంత్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (సివిల్ సప్లయ్) వి.పోతురాజు, కంప్యూటర్ ఆపరేటర్ (రెవెన్యూ) పి.రాజసుధీర్, దేవదాయశాఖ ఈఓ ఏవీ నారాయణ, ఇటీవల బదిలీఅయిన ఎంఈఓ డి.శారదా జ్యోత్స్న, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ జీవీ హనుమాన్, టైపిస్ట్ వీఎస్ఆర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ జె.ఫణికుమార్‌లను సత్కరించారు. ఏఎంసీ చైర్ పర్సన్ వెలగల వెంకటరమణ, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, వైస్‌ఎంపీపీ-1, 2 వాసంశెట్టి కిరణ్, ఈది అనితప్రవీణ్, మండల వ్యవసాయశాఖ సలహా సంఘం చైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



చీఫ్‌విప్ ప్రసాదరాజుకు కృతజ్ఞతలు చెబుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పార్టీ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులకు సూచించారు. నరసాపురం నియోజకవర్గం నుంచి జిల్లా కార్యవర్గంలోకి ఎంపికైన సభ్యులు కడలి రాంబాబు, తిరుమాని నాగరాజు, పడవల సత్యనారాయణ, ముస్కుడి రత్నం తదితరులు ప్రసాదరాజును శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకెలిచ్చి కృజ్ఞతలు తెలిపారు. ఈ సందరర్భంగా ప్రసాదరాజురాజు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చాకా చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియాలన్నారు. పదవులకు వన్నె తెచ్చే విధంగా పనిచేయాలని సూచించారు. పార్టీ కేంద్రకార్యాలయం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయమని, 175కు 175 స్థానాలు సాధించే విధంగా పనిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీటీడీ బోర్డు మెంబర్ శేషుబాబుకు అభినందనలు



పూలపల్లిలో శేషుబాబుని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి



శేషుబాబును సత్కరిస్తున్న క్షీరారామలింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ

పాలకొల్లు అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా నియమితులైన మేకా శేషుబాబుని శనివారం వైఎస్సార్ సీపీ నియోజవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామికి సేవ చేసుకునే అదృష్టం రావడం పూర్వ జన్మ సుకృతమని గోపి అన్నారు. ఆకివీడు మునిసిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్, గూడూరి ఉమాబాల, కోరుకొల్లు బాబు, ముచ్చర్ల శ్రీనివాస్, దేవస్థానాల చైర్మన్‌లు, ట్రస్టీలు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

శేషుబాబుకు సత్కారం

పాలకొల్లు సెంట్రల్: కలియుగదైవం తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబును క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈఓ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శేషుబాబు నివాసానికి వెళ్లి ఆయన్ని సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

రహదారుల నిర్మాణం సత్వరం చేపట్టాలి



తూర్పుపాలెంలో సమీక్షిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రహదారుల నిర్మాణం సత్వరం ప్రారంభించి, రహదారి సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెంలో రోడ్లు భవనాల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వేల్పూరు – సత్తారామేశ్వరం రహదారి నిర్మాణానికి రూ.6.88 కోట్లు మంజూరయ్యాయని, ఎస్ ఇల్లింద్ర పర్రు, మల్లిపూడి, జుత్తిగ, సత్తారామేశ్వరం గ్రామాలకు సుమారు 11 కిలో మీటర్లు మేర రోడ్డు నిర్మించాలని అన్నారు. సిద్ధాంతం – జుత్తిగ రహదారికి రూ.2.22 కోట్లు, కవిటం – గుమ్ములూరు రహదారికి రూ.3 కోట్లు, నర్సాపురం – అశ్వారావుపేట రహదారికి రూ.25 కోట్లు మంజూరయినట్టు చెప్పారు. వడలి, మునమర్రు రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేశామన్నారు. పెనుగొండ – ములపర్రు, ఆచంట – సిద్ధాంతం రహదారికి రూ.17 కోట్లు విస్తరణ పనులు చేస్తున్నామని చెప్పారు. దీంతో ఆచంట నియోజకవర్గంలో ప్రధాన రహదారుల సమస్యలు తీరతాయన్నారు. రోడ్లు నిర్మాణాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సమావేశంలో పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, పెనుగొండ, ఆచంట ఏఎంసీల వైస్ చైర్మన్లు గుబ్బల వీర బ్రహ్మం, తానేటి నాగ మల్లేశ్వరరావులు పాల్గొన్నారు.

రామాలయంలో వెండి కిరీటాల సమర్పణ



వెండి కిరీటాలను అర్చకునికి అందిస్తున్న దాతలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి రామాలయంలోని రమా వీరవెంకట సత్యనారాయణస్వామివార్లకు దాతలు వెండి కిరీటాలను సమర్పించుకున్నారు. శనివారం దాతలు గొన్నాబత్తుల మాణిక్యాలరావు, ధనలక్ష్మి, సత్యనారాయణమూర్తి, ప్రవీణ దంపతులు 500 గ్రాముల వెండితో తయారు చేయించిన రెండు కిరీటాలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. తొలుత అర్చకులు ఆచార్యులు ఆశీర్వచనం చేసి వెండి కిరీటాలను పాలతో శుద్ధి చేసి మూలవిరాట్‌లకు అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు శ్రీకాకొల్లు వెంకన్న, విన్నకోట శ్రీరంగనాయకులు, జంధ్యం ఉప్పరి, బదరి తదితరులు పాల్గొన్నారు.

హీరో గ్లామర్ క్లాసిక్ బైక్ విడుదల

పెనుమంట్ర: బైక్‌లు, స్కూటర్‌లు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు నిత్యావసరాలుగా మారాయని, అందుకు అనుగుణంగా ఆయా కంపెనీలు అందుబాటు ధరలలో తీసుకురావాలని ఎమ్మెల్సీ, ఎంఎస్ఎంఈ మాజీ చైర్మన్ వంకా రవీంద్రనాథ్ అన్నారు. నెగ్గిపూడిలో భాగ్యశ్రీ మోటార్స్‌లో హీరో గ్లామర్ క్లాసిక్ బైక్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఒకప్పుడు అత్యధికంగా అమ్ముడైన గ్లామర్ నేడు క్లాసిక్‌గా విజయవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. మొదటి గ్లామర్ బండిని కొనుగోలుదారుడు ఆసు ఈశ్వరరావుకు ఆయన అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, విద్యా మౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ కర్రి వేణుబాబు, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు కీర్తి తాతాజీ, ఆకేటి సత్యం, ప్రముఖ రైస్ మిల్లర్ గాజుల బులిపుల్లారావు, ప్రముఖ ఇంజనీర్ సత్యనారాయణరెడ్డి, ఆసు నగరి, భాగ్యశ్రీ ఎండీ ఆసు శ్రీను పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివి



మేడపాడు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుని సన్మానిస్తున్న దృశ్యం

యలమంచిలి: ఆరోగ్య సిబ్బంది సమాజానికి అందిస్తోన్న సేవలు ఎంతో విలువైనవని మెడికల్ ఆఫీసర్ భారతి అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా శనివారం మేడపాడు పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సు మంగతాయారుని రోటరీ క్లబ్ ఆఫ్ గోదావరి యూనిట్ సభ్యులు శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ కుంపట్ల రామ్‌గోపాల్, పాస్ట్ చైర్మన్ చవ్వాకుల నరేష్ బాబు, కోశాధికారి శిరిగినీడి రాంబాబు, సభ్యులు ఎం కోటేశ్వరరావు, ఫార్మాసిస్ట్ మాఘం సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

యలమంచిలి మండలం బూరుగుపల్లి గ్రామంలో ఉన్న అగాపే ఛారిటబుల్ ట్రస్ట్ 9వ వార్షికోత్సవం సందర్భంగా పలు గ్రామాల్లోని అనాథలకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ పమ్మి లాజర్, ట్రస్ట్ కార్యదర్శి పమ్మి తాతాజీ, కోశాధికారి పమ్మి లీలమ్మ, పాస్టర్లు మానుకొండ చిన్న, సీహెచ్ నాగరాజు, పి.యజ్రా పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా సేవలు ఆదర్శనీయం

పాలకొల్లు సెంట్రల్: ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అని పేదల సేవలోనే తరించిన ప్రేమమూర్తి మదర్‌థెరిస్సా సేవలు నేటి సమాజానికి ఆదర్శనీయమని ప్రధానోపాధాయులు రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లయన్స్ ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో రాహుల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రైస్, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పాలకొల్లు పట్టణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గురికి స్థానిక కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్టు క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు చెప్పారు. వారికి మందులు, పండ్లు అందజేసి వారిని ఇంటికి పంపించామన్నారు. క్లబ్ సభ్యులు పీర్‌సాహెబ్, బసవరాజు, ఉమాశంకరరావు, నరసింహమూర్తి, నరసింహరావులు పాల్గొన్నారు.

దంత, నేత్ర వైద్యపరీక్షలు

పోడూరు: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్‌ఏఐ) పాలకొల్లు యూనిట్ ఆధ్వర్యంలో జిన్నూరులోని ఐడియల్ స్కూల్ ప్రాంగణంలో శనివారం ఉచిత దంత, నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వైహెచ్‌ఏఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సోమరాజు వైహెచ్‌ఏఐ వ్యవస్థాపకులు రిచర్డ్ చిత్రపటానికి పూలమాల వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా 100 మందికి డాక్టర్లు చల్లా హేమంత్‌మాధుర్, కావలి మౌని, లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అధ్యక్షులు పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు భూపతిరాజు అచ్యుతరామరాజు, పాలకొల్లు యూనిట్ చైర్మన్ కారుమూరి సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కొట్టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్రం భూములకు వేలం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని మన్యం జగ్గమ్మగారి సత్రానికి సంబంధించి పూలపల్లిలో ఉన్న 16.50 ఎకరాల చేపల చెరువులకు శనివారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు మొదటి సంవత్సరానికి రూ.9,75,000, రెండో ఏడాది 10 శాతం పెంపుతో రూ.10,72,500, మూడో సంవత్సరం రూ. 11,79,750లకు పాడుకున్నారు. పాత మక్తా రూ.6,12,000 ఉంది. సత్రానికి సంబంధించి నాలుగు షాపులకు నిర్వహించిన వేలం పాటలో నెలకి ఒక్కొక్క షాపుకి రూ. 12,600కి హెచ్చు పాటకి పాడుకున్నారు. పాత అద్దె నెలకి రూ.10,500 ఉంది. దేవదాయ శాఖ (భీమవరం) తనిఖీ అధికారి వి.వెంకటేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ నంబూరు శ్రీగంగా పవన్‌కుమార్, ఈఓ, ట్రస్టీలు పాల్గొన్నారు.